



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పాఠ్య పుస్తకాలు లేకుండా...

పరీక్షలకు సన్నద్ధం ఎలా..?

ఆందోళనలు చేసినా పట్టించుకోని పాలకులు

మార్చిలో ఇంటర్ పరీక్షలు





పాఠ్య పుస్తకాల కోసం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి-హిందూపురం

వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్య...వైద్య రంగాల్లో సమూల మార్పులు తీసుకు రావడమే తమ లక్ష్యం అంటూ ప్రతి చోట ఊదర గొడుతున్నారు. అయితే ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు ఇవ్వాల్సిన పాఠ్య పుస్తకాలను విద్యా సంవత్సరం పూర్తి అవుతున్నప్పటికి ఇవ్వలేదు. పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలు చేసినప్పటికి ప్రభుత్వం మొద్దు నిద్ర వీడలేదు. ఇప్పటివరకు పుస్తకాలను ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో మార్చి నుంచి జరిగే పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో అర్థం కాక విద్యార్థులు తపన పడుతున్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో పాలకుల బాధ్యతారాహిత్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పుస్తకాలందించకుండా మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతారని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరుకోవడం అత్యాశే అవుతుందని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. విద్యావ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని పదేపదే చెప్పుకునే సిఎం జగన్ తన పరిపాలన ఆచరణలో ఎలా ఉందన్నదానికి ఈ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీయే నిదర్శనంగా నిలుస్తోంది. మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రీ ఫైనల్ పరీక్షలు ఇప్పటికే నిర్వహిస్తున్నారు. అయినప్పటికి చాలామంది విద్యార్థులకు ఇప్పటికీ పుస్తకాలంద లేదు. నిజానికి ఏపీలో పుష్కరకాలానికి పైగా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేవారు. 2008-09 నుంచి 2012-13వరకు టీటీడీ ఈ పుస్తకాలకు నిధులు ఇవ్వగా 2014-2020వరకు ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి నిధులతో ఉచిత పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేసేవారు. అయితే రెండేళ్లుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదు. ఓల్డ్‌స్టాక్ కింద ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. కొన్ని కాలేజీల్లో ప్రిన్సిపాళ్లే చొరవచూపి సీనియర్ విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలను తీసి కొంతమందికి సర్దుబాటు చేయగా ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేకుండానే చదువులు పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది ఉమ్మడిజిల్లాలో ప్రథమ ఇంటర్‌లో 57శాతం ఉత్తీర్ణతతో వెనుకబడిన ఒత్తిడిలో ఉన్న అధ్యాపకులకు ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ఎలా అని మదనపడుతున్నారు. మరోపక్క పుస్తకాలు లేకుండా చదువులు సాగించిన తమ పిల్లలకు పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది.

ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 63 మండలాల్లో 42 ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. ప్రథమ ఇంటర్‌లో దాదాపు 2,346మంది, ద్వితీయ ఇంటర్‌లో దాదాపు 1,977మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని సబ్జెక్టులకు కలిపి ప్రథమలో 21,658, ద్వితీయలో 18,658 పుస్తకాల కోసం ఇంటర్ బోర్డుకు ఇండెంట్ పంపినట్లు సమాచారం. జిల్లాలో 63 మండలాల్లో ఉన్నా కేజీబీవీలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. వీటిలో ఇంటర్ కోర్సుల్లో చేరిన విద్యార్థులకు కూడా ప్రభుత్వమే ఉచిత పుస్తకాలు అందించాల్సి ఉండగా పాత పుస్తకాలనే విద్యార్థులకు అరకొరగా విద్యార్థులకు అందించారు. వీటితో పాటు జిల్లా వ్యాప్తంగా ఏపీఆర్‌జేసీ, ఏపీమోడల్, సాంఘిక సంక్షేమ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 8 వేల మందికి పైగా విద్యార్థులున్నట్లు సమాచారం. కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు. కానీ పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు. పాఠ్యపుస్తకాలను ముద్రించకుండా ప్రైవేట్ మార్కెట్‌లో విద్యార్థులు కొనుక్కోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. అయితే గతేడాది జిల్లాలో గ్రౌండ్ బ్యాలెన్స్ కింద ఉన్న దాదాపు 10శాతం పుస్తకాలను కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లారని అధికారులు అంటున్నారు.

కనీసం మెటీరియల్‌ను కూడా అందించ లేదు



ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను అందించాలని, జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్నా అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర వ్యాప్తంగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను నిర్వహించాం. అయినప్పటికి ప్రభుత్వంలో కనీస చలనం కనిపించ లేదు. మరో 10 రోజుల్లో పబ్లిక్ పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించి, ప్రత్యేక తరగతులను నిర్వహించి మెరుగైన ఫలితాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ కళాశాలల్లో పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.

బాబావలి,
ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు

పోలియో రహిత సమాజాన్ని స్థాపిద్దాం

కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పోలియోను పూర్తిగా నిర్మూలించి పోలియో రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా పనిచేద్దామని జిల్లా కలెక్టర్ అరుణబాబు పిలుపునిచ్చారు. మార్చి 3 నుండి నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం నేపథ్యంలో గురువారం స్థానిక కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికారులతో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ మీటింగ్‌ను కలెక్టర్ నిర్వహించారు. అప్పుడే పుట్టిన బిడ్డనుండి 5 సంవత్సరాల లోపు ఉన్న ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేసి వేయించాలన్న సూక్తిని సమావేశానికి వచ్చిన ప్రతి అధికారి తప్పక పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా పోలియో చుక్కల గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఎస్‌వి. కృష్ణారెడ్డి, జిల్లా వ్యాధి నిరోధకటీకాల అధికారి డాక్టర్ కృష్ణయ్య, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, నాలుగు డివిజన్ల డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లాలో ఉన్న అన్ని శాఖల అధికారులు, నాన్ గవర్న మెంట్ ఆర్గనైజేషన్ రూరల్ డెవలప్ మెంట్ ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఉమ్మడి జిల్లాల వాష్ కోఆర్డినేటర్ ఆర్. లక్ష్మీదేవి

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



అవగాహన కల్పిస్తున్న లక్ష్మీదేవి

ప్రతిమనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ప్రాథమికంగా పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత, శుద్ధతాగునీరు అవసరమని ఉమ్మడి జిల్లాల వాష్ కోఆర్డినేటర్ ఆర్. లక్ష్మీదేవి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మెప్మా కార్యాలయంలో మెప్మా జిల్లా అధ్యక్షురాలు పి.సాయి లీల అధ్యక్షతన స్వయం సహాయక సంఘాల మహిళల ప్రతినిధులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మంచి తాగునీరు తీసుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పరిశుభ్రతపైఔ మహిళా ప్రతినిధులు ఆయా సంఘాలలోని సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటిలోనూ ఇలా పాటించే విధంగా అవగాహన కల్పిస్తే పలు రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఇంటిలోనూ మరుగుదొడ్లు అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా సిఎంఎం రమాదేవి, డిఎంసి శ్రీనివాసరెడ్డి, సీసీలు ఆదినారాయణ, ధరణి తదితరులు పాల్గొన్నారు.

రాగి పంట పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం సంతేబిదనూరు, రామచంద్రపురం, చౌళూరు గ్రామాలలో రైతులు సాగు చేసిన రాగి పంటను ఎఒ సురేంద్ర నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. మండల వ్యాప్తంగా 490 ఎకరాల్లో రాగి పంటను రబీ సీజన్‌లో రైతులు సాగు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి

జిల్లాస్థాయి ఆసుపత్రి తరహాలో వైద్య సేవలు

హెల్త్‌సెంటర్ ప్రారంభోత్సవంలో వైసిపి ఇన్‌ఛార్జి దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా అసుపత్రి స్థాయిలో సౌకర్యాలు కల్పించి అదే స్థాయిలో సేవలను అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణురెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. పట్టణంలోని మేళాపురంలో రూ.80లక్షలతో నిర్మించిన డాక్టర్ వైయస్‌ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని వారు వైస్ ఛైర్మేన్ జబివుల్లాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఈ-మెడిసన్ (టెలీమెడిసన్) సేవలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉన్నాయన్నారు. విద్య, వైద్యం పేద ప్రజలకు అందుబాటులోకి తీసుకోస్తుంటే హర్షించాల్సిన ప్రతి పక్షం విమర్శంచడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి, పలువురు కౌన్సిలర్లు, టౌన్ క్లస్టర్ 1 కన్వీనర్ మన్సూర్, టౌన్ మైనారిటీ కన్వీనర్లు అయుబ్‌బేగ్, షాజహాన్, టౌన్ యూత్ వింగ్ కన్వీనర్ అతిక్ రహమాన్, నాయకులు శ్రీరామ్ రెడ్డి, ఆసిఫ్ ఇమ్రాన్ తో పాటు అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



గుంతకల్లుకు 'గుమ్మనూరు'

నేడో, రేపో టిడిపిలో చేరే అవకాశం

తనతోపాటు పార్టీలో చేరాలని అనుయాయులకు సంకేతం

రసవత్తరంగా రాయలసీమ రాజకీయం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కార్మిక శాఖ మంత్రిగానున్న గుమ్మనూరు జయరాం వైసిపిని వీడేందుకు సిద్ధమైనట్టు ప్రచారం నడుస్తోంది. ఈ మేరకు ఆయన ఒకటి, రెండు రోజుల్లో టిడిపిలో చేరుతారన్న ఊహాగానాలు జోరుగా సాగుతున్నాయి. ఈ మేరకు ఆయన తన అనునూయులతోనూ ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు సమాచారం. తన అనుయాయులు కూడా పార్టీలో చేరాలని ఆయన ఈసందర్భంగా సూచించినట్లు తెలుస్తోంది. కార్మిక శాఖ మంత్రిగానున్న గుమ్మనూరు జయరామ్‌కు రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గం కాకుండా కర్నూలు పార్లమెంటు సభ్యుడిగా పోటీ చేయాలని అధిష్టానం నిర్ణయించింది. ఈ మేరకు పేరును ఖరారు చేసి ప్రకటించింది. అయితే ఆయన పార్లమెంటుకు కాకుండా అసెంబ్లీ నియోజకవర్గానికే పోటీ చేయాలన్న ఆలోచనతోనున్నారు. ఇక వైసిపిలో ఆ అవకాశం దక్కే సూచనల్లేవన్న ఉద్దేశ్యంతో పార్టీ మారి అసెంబ్లీకి పోటీ చేయాలన్న యోచనలోనున్నట్టు తెలుస్తోంది. అయితే ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి టిడిపి అభ్యర్థి మరొకరు ఉండటంతో ఆ నియోజకవర్గం పకకనే ఉన్న అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం వైపు దృష్టి సారించినట్టు రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది. బోయ సామాజిక తరగతి అధికంగానున్న ఈ నియోజకవర్గంలో ఆయన్ను దింపడం ద్వారా కొంత ప్రయోజనముండే అవకాశముందని టిడిపి అధిష్టానం కూడా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఆయన చేరికకు మార్గం పూర్తి స్థాయిలో సుగమమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు పార్టీ కోసం పనిచేస్తూ వచ్చిన గుంతకల్లు టిడిపి నాయకులు తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే జితేందర్ గౌడ్ కుటుంబానికి ముందు నుంచి నియోజకవర్గంలో మంచి పట్టుంది. ఆయన సోదరుడు సాయినాథ్‌గౌడ్ హయాం నుంచి ఆ కుటుంబం ఎమ్మెల్యేగా ఉంటూ వచ్చింది. మధ్యలో మార్పులు జరిగినా 2014 ఎన్నికల్లోనూ జితేందర్‌గౌడ్‌కు పార్టీ టిక్కెట్టు ఇచ్చింది. ఆయన విజయం సాధించారు. 2019లోనూ ఆయనకే ఇచ్చింది. అయితే ఓటమి చెందారు. అప్పటి నుంచి కూడా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగాఉంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇక జీవానందరెడ్డి వైసిపి నుంచి వచ్చి టిడిపిలో చేరారు. ఆయన కూడా టిక్కెట్టు ఆశిస్తున్న వారి జాబితాలోనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇప్పుడు పాతవారికి కాదని ఇతర పార్టీ నుంచి వచ్చి చేరిన వెంటనే, అది కూడా పక్క జిల్లా వ్యక్తికి టిక్కెట్టు ఖరారు చేసే ఆలోచన సరైంది కాదని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. జయరాం స్థానికేతరుడన్న అంశాన్ని తెరపైకి తెస్తున్నారు. అయితే జయరాం పార్టీలో చేరి గుంతకల్లు అభ్యర్థి అయితే ఏ మేరకు పార్టీ నేతల నుంచి సహకారముంటుందన్నది చర్చ నడుస్తోంది. జయరాంకు జిల్లాలోని కొంత మంది నేతలతోనూ ముందు నుంచి సంబంధాలున్నాయి. ఆ సంబంధాలతోనే ఆయన టిడిపి వైపు మొగ్గు చూపారన్న చర్చ నడుస్తోంది. ఆయన సామాజికవర్గం అధికంగా ఉండటంతో అది కూడా కలిసొస్తుందని భావిస్తున్నారు. ఏది ఏమైనా గుంతకల్లు అసెంబ్లీ రాజకీయాలు కూడా రసవత్తరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. వైసిపి కూడా ఇంకా ఆ స్థానంలో అభ్యర్థులను ఖరారు చేయలేదు. సిట్టింగు ఎమ్మెల్యేగానున్న వై.వెంకటరామిరెడ్డి మాత్రం తనకే ఈసారి కూడా టిక్కెట్టు అని చెబుతున్నప్పటికీ ఎలాంటి మార్పులు అక్కడా జరగనున్నాయన్నది చూడాల్సుంది.

జాతీయస్థాయిలో 'పాంచజన్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియాన్స్ ఇండియా (ఎన్ ఐ ఎస్ ఏ) జాతీయస్థాయిలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎన్ఎఏటి -2023 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తఫా జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు, రిధా, ఫాతిమాలు ద్వితీయ ర్యాంకు సాధించారు. వీరికి బుధవారం డిల్లీలోని హయాత్ హోటల్ లో పద్మశ్రీ డాక్టర్ జితేందర్ సింగ్, ఎన్ఐఎస్ఎ అధ్యక్షులు కుల భూషణ్ శర్మల చేతుల మీదుగా బహుమతులతో పాటు ప్రశంశా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు గురువారం మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ స్థాయిలో బహుమతులు అందుకున్న విద్యార్థులను పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, హెచ్ఎం గాయత్రి, ఏవో భాస్కర్, సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్ అభినందించారు.



జాతీయ స్థాయి ప్రథమ బహుమతి అందుకున్న ముస్తఫా



రాస్తారోకోలో పాల్గొన్న నాయకులు

రైతు ద్రోహి బిజెపి : సిపిఎం

ముదిగుబ్బ : ఢిల్లీ పోలీసులచే దాడి చేయించి రైతు శుభకరంసింగ్ ను కేంద్ర ప్రభుత్వం బలి తీసుకుందని రైతుసంఘం జిల్లా నాయకులు బడాసుబ్బిరెడ్డి విమర్శించారు. రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఎం సిఐటియు నాయకులు రాస్తారోకో చేశారు ఈ సందర్భంగా బడా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతు ఉద్యమం పట్ల నరేంద్ర మోడీకి కనికరం లేదన్నారు హర్యానా పోలీసులు సాగించిన దుర్మార్గమైన దాడిలో 24 సంవత్సరాల శుభకరం సింగ్ అనే రైతు ఉద్యమకారుడు తీవ్రంగా గాయాలపాలై మృతి చెందడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా రైతు సంఘం అధ్యక్షులు బడా సుబ్బారెడ్డి సిపిఎం నాయకులు ఆటో పెద్దన్న, సిఐటియు నాయకులు బండల వెంకటేశు, బాబు, మధుసూదన్ రెడ్డి, ఓబులేసు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు

వాలంటీర్ వ్యవస్థతో ప్రజారంజక పాలన : వైసిపి

ప్రజాశక్తి-హిందూపురం



వాలంటీర్లను సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి దీపిక

వాలంటీర్ వ్యవస్థతో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజారంజక పాలన సాగిస్తున్నారని వైసిపి ఇన్‌చార్జ్ దీపిక వేణురెడ్డి అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో గురువారం మండల వ్యాప్తంగా ఉన్న వాలంటీర్లకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో దీపిక వేణురెడ్డి పాల్గొన్న ఎంపిడిఒ వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో దీపిక మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని అన్నారు. వరుసగా నాలుగో ఏడాది నిర్వహిస్తున్న వాలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత రెడ్డి, మండల కన్వీనర్ రాము, జెసిఎస్ కన్వీనర్ గిరి, సర్పంచులు లలితా రాము, సరస్వతి ఆదెప్ప, దేవరాజు, ఎంపీటీసీ రామకృష్ణారెడ్డి, నాయకులు నక్కల పల్లి శ్రీరామ్ రెడ్డి, తిప్పేరుద్రయ్య, నందమూరి నగర్ మోహన్, భాను ప్రకాష్ రెడ్డి, ఇఒఆర్‌డి నటరాజ్, పంచాయితీ సెక్రెటరీలు కెంచరాయప్ప, గంగధర్, ఆశ్వర్థరెడ్డి, అర్షాద్, వేణు, మండల వ్యాప్తంగా ఉన్న వైసిపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో జామ, వక్క తోట దగ్ధం

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్



అగ్నికి ఆహుతి అయిన జామ చెట్లు

ఆకతాయిల చేష్టల వలన కోతకు వచ్చిన జామ, వక్క తోట బుగ్గిపాలయింది. అందుకు సంబందించిన వివరాలు... పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి చిన్న తండాకు చెందిన బాబయ్య నాయక్ తన నాలుగు ఎకరాల పొలంలో జామ, వక్క, కొబ్బరి తోటను సాగుచేశాడు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు పక్క పొలాల్లో నిప్పు పెట్టడంతో మంటలు బాబయ్య తోటకు వ్యాపించాయి. దీంతో జామ, వక్క తోట పూర్తిగా అగ్నికి ఆహుతి అయ్యింది. 500 జామ, వక్కచెట్లు కాలి బూడిద అయ్యాయి. విషయం తెలుసుకున్న రైతు బాబయ్య పొలానికి పరుగులు తీశాడు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా పుట్టపర్తి నుండి అగ్నిమాపక సిబ్బంది పెడపల్లికి చేరుకునే లోపు తోట అగ్నికి ఆహుతి అయింది. దీనితో పాటు డ్రిప్పు పైపులు, స్ప్రింకర్లు, తదితర సామాగ్రి సైతం కాలి బూడిదయింది. ఈ సందర్భంగా బాధిత రైతు బాబయ్య నాయక్ మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి తీరా తోట చేతికి వచ్చే సమయంలో ఇలా జరిగిందన్నారు. దీని ద్వారా పది లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయారు. గత ఐదు సంవత్సరాల నుండి పెంచిన తోట అగ్నికి ఆహుతి కావడం పట్ల బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుల అరెస్టు శోచనీయం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మడకశిర

జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ కోసం ఎపి కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో 'చలో సెక్రటేరియట్' కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న నాయకులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడం శోచనీయమని సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాంతియుతంగా 'చలో సెక్రటేరియట్' కార్యక్రమం చేపట్టగా అడ్డుకునేందుకు ప్రభుత్వం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని పార్టీ కార్యాలయం చుట్టూ వందలాది మంది పోలీసులను పెట్టి పిసిసి చీఫ్ షర్మిలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాన్ని అడ్డుకుంటే సహించబోమన్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే సుధాకర్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

26న 'అనంత'లో కాంగ్రెస్ బహిరంగ సభ


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శైలజానాథ్

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఈ నెల 26వ తేదీ అనంతపురం నగరంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీ బహిరంగ సభను విజయ వంతం చేయాలని ఎపిసిసి మాజీ అధ్యక్షులు శైలజానాథ్ పిలుపునిచ్చారు. స్థానిక బంగ్లాలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆ సభకు ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, పిసిసి చీఫ్ షర్మిలారెడ్డి, సభ్యులు రఘువీరారెడ్డి, పల్లం రాజు హాజరవుతారని తెలిపారు. అందులో దేశ వ్యాప్త కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఖర్గే ప్రకటిస్తారన్నారు. అలాగే ఆయన ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. షర్మిల నాయకత్వంలో ఎపిలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తే రాష్ట్రానికి మంచి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎపిసిసి ఉపాధ్యక్షులు శ్రీధర్, ప్రధాన కార్యదర్శి షానవాజ్, డిసిసి ఉపాధ్యక్షుడు నాగభూషణం, పట్టణ అధ్యక్షుడు అశ్రఫ్, అమీర్, పారేసు, నాగేంద్ర, అక్రం, నాగేంద్రయాదవ్, బాబా, ఖాదర్ బాషా, అల్లాబకాష్, కదిరప్ప, షౌకత్, ఇర్ఫాన్, షబ్బీర్ పాల్గొన్నారు.

పాఠశాలలను సందర్శించిన స్టేట్ టీం


సంజీవపురం కెజిబివిలో స్టేట్ టీం సభ్యులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం పాఠశాల స్థాయిలో ఏవిధంగా ఇంప్లిమెంట్ అవుతుందో తెలుసుకోవడానికి గురువారం రాష్ట్ర స్థాయి బృందం జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించిందని ఎంఇఒ-2 గోపాల్‌నాయక్ తెలిపారు. ఆ బృందం సంజీవపురం కెజిబివి, ధర్మవరం బిఎస్ఆర్ మున్సి పల్ బాలుర ఉన్నత పాఠశాల, కొత్తచెరువు మండలం కేశాపురం జడ్పీ హైస్కూల్, పుట్టపర్తి మండలం జగరాశిపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించిందన్నారు. వారు బోధన, విద్యార్థుల ప్రగతి, తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదిలో లోపాలను గుర్తించి ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. వారి వెంట స్టేట్ రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు, విజయ్‌కుమార్, డేవిడ్, హెచ్ఎం రాంప్రసాద్ ఉన్నారు.

బత్తలపల్లి : మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించాలని ఎల్ఐపి సభ్యులు సూచించారు. స్టేట్ టీం సభ్యులు బి.గోపాల్‌నాయర్, విజయకుమార్, శ్రీనివాసులు, డేవిడ్, ఎంఇఒలు చాముండేశ్వరి, వి.సుధాకర్‌నాయర్ మండలంలోని సంజీవపురం కెజిబివిని సందర్శించారు. వారితో పాటు ప్రిన్సిపల్ గుల్జార్‌బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ మాధవరెడ్డి గురువారం ధర్మవరం నియోజకవర్గంలోని తాడిమర్రి, బత్తలపల్లి, ముదిగుబ్బ, ఏకపాదంపల్లి, మాల్యవంతం, అప్రాచెరువు, మంగలమడక, పట్నం, తదితర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతాపరమైన చర్యలపై పోలీస్ అధికారులకు సూచనలు చేశారు. ఎన్నికల సమయంలో పోలింగ్ కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఏ పోలింగ్ కేంద్రంలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, తదితర విషయాలపై ఆరా తీశారు. ఎస్పీ వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, ముదిగుబ్బ సిఐ కృష్ణంరాజు నాయక్, ఎస్‌లు నాగస్వామి, శ్రీనివాసులు, నరసింహులు ఉన్నారు.

బత్తలపల్లి : ఎస్పీ మాధవరెడ్డి మండలంలోని మాల్యవంతం, బత్తలపల్లి, అప్రాచెరువు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ప్రహరీ సరిగా లేదని, దీనిపై సంబంధిత అధికారులకు సూచనలు ఇవ్వాలన్నారు. ముందుగా గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఫ్యాక్షన్, గొడవలు, ఘర్షణల వల్ల జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు. వారితో పాటు ఎస్ఐ శ్రీనివాసులు ఉన్నారు.

ముదిగుబ్బ : స్థానిక బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలతో పాటు మంగళమడక గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ మాధవరెడ్డి సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. సమస్యాత్మక వ్యక్తులపై గట్టి నిఘా ఉంచి అల్లరి మూకలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సిఐ కృష్ణంరాజునాయక్, టౌన్ సిఐ యతీంద్ర, ఎఎస్ఐ రాజు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట, కటారుపల్లి, కమతంపల్లి, మద్దివారి గొంది మల్ల, మీదపల్లి తదితర పోలింగ్ కేంద్రాలను గురువారం కదిరి ఆర్డీవో వంశీకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో వినియోగదారులకు మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడా అసౌకర్యం కలగకుండా చూసుకోవాల్సి బాధ్యత అధికారులదే అన్నారు. ఆయన వెంట ఎంపిడిఒ రామనాయక్, డిప్యూటీ తహశీల్దార్ బి.రవి, బిఎల్ఒలు భవానీ, శివశంకర్, బి.సోమశేఖర్‌రెడ్డి, రఫీ ఉన్నారు.

జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం : పల్లె


పల్లె సమక్షంలో టిడిపిలో చేరిన నాయకులు

ప్రజాశక్తి-బుక్కపట్నం


వైసిపి పాలనలో ప్రజలు నరకయాతన అనుభవించారని, కావున వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. పల్లె ఎన్ని కల ప్రచారాన్ని గురువారం మండలంలోని గోపాలపురం గ్రామం నుంచి ప్రారంభించారు. ముందుగా గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలు, టిడిపి సూపర్‌సిక్స్, మినీమేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్‌రెడ్డి, నాయకులు సాకే యశోదరాయుడు, గంగాధర్, లక్ష్మీనారాయణ, నారాయణస్వామి, లావణ్యగౌడ్, వెంకటరాముడు, పల్లపు రవీంద్ర, పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని చారుపల్లి గ్రామ పంచాయతీ రెడ్డిపల్లి గ్రామంలో గురువారం 25 కుటుంబాలు మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరాయి. వైసిపికి చెందిన నారాయణరెడ్డి, గోపాల్, వీరనారాయణప్ప, నారాయణస్వామి, శివ, గంగ, భాస్కర్, బిల్లే హర్షవర్ధన్, కుంచె అమర్నాథ్, ఆంజనేయులు, రవినాయక్, భరత్, మోహన్‌రెడ్డి, రవి, లక్ష్మీనారాయణ, మోహన్, రవితో పాటు పలువురు టిడిపిలో చేరగా పల్లె వారికి పసుపు కండువా వేసి ఆహ్వానించారు.

పంటల సస్యరక్షణపై శిక్షణ

నల్లచెరువు : స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో గురువారం వేరుశనగ, వరి పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పంటల సస్యరక్షణ చర్యలు, తెగుళ్లు, నివారణ మందులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎ.రమణారెడ్డి, ఎడిఎ సానావుల్లా, ఎఒ భారతి, ఎఇఒ కవిత, వివిధ గ్రామాల విఎఎ, విహెచ్ఎలు, రైతులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం


సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర : పట్టణంలోని రాజీవ్ గాంధీ సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సామాజిక మరుగుదొడ్డి (సులభ్ కాంప్లెక్స్)ని గురువారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి సర్కిల్‌లో కూడా సులభ్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేస్తామని, వైఎస్ఆర్ సర్కిల్‌లో ఉన్న దానికి మరమ్మతులు చేసి ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రంగస్వామి, ఎఇ మురళి, ఎంపిపి కవిత సత్యనారాయణ, నగరపంచాయతీ వైస్ ఛైర్మన్లు రామచంద్రారెడ్డి, వెంకటలక్ష్మి, రామిరెడ్డి, జయరాజు, ఈశ్వర్, కౌన్సిలర్లు సుభద్రనాగేంద్ర, అన్సర్‌ఖాన్, సుధాకర్‌నాయక్, మేఘన, రమేష్, సిద్దప్ప కో ఆప్షన్ సభ్యులు ఫక్రుద్దీన్, సైఫుల్లా, మంజునాథ్, రాజేష్, శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, రమేష్, అంజలి, నవీన్, రాజు పాల్గొన్నారు.

టిడిపి-జనసేన కూటమిదే అధికారం

ఎన్నికల ప్రచారంలో కందికుంట


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

రానున్న ఎన్నికల్లో టిడిపి-జనసేన కూటమి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తుందని నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో గురువారం కదిరి కందికుంట వెంకట ప్రసాద్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం తలుపుల మండలం సంగలివారిపల్లె నుంచి కందికుంట, పట్టణంలో యశోదమ్మ ప్రచారాన్ని ప్రారంభించారు.

వారంలోపు హంద్రీనీవా ద్వారా సాగునీరివ్వాలి : కందికుంట

తలుపుల : ప్రభుత్వం వారంలోపు హంద్రీనీవా కాలువ ద్వారా రైతులకు సాగునీరు అందించాలని లేనిచో రైతులతో కలిసి పోరాటం చేస్తామని కందికుంట హెచ్చరించారు. మండలంలోని కొరుగుట్టపల్లి గ్రామ సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద ఆయన సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా చాలామంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, అయితే సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. టిడిపి హయాంలో 90 శాతం హంద్రీనీవా కాలువ పూర్తి చేశామన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే పూర్తి చేసి సాగునీరు ఇస్తామని చెప్పి ఇంతవరకూ పూర్తి చేయలేదన్నారు.

అభివృద్ధి చేసే పార్టీని ఆదరించండి : కందికుంట

వచ్చే ఎన్నికల్లో అభివృద్ధికి మారుపేరైన టిడిపిని గెలిపించాలని కందికుంట పిలుపునిచ్చారు. ఆయన టిడిపి నాయకులు పవన్ కుమార్‌రెడ్డి తో కలిసి 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'తో పాటు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా బాబాషర్ఫుద్దీన్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంగటివారిపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించగా మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. ఆయన ఇంటింటికీ వెళ్లి టిడిపి మినీమేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, పర్వీన్‌బాను, మనోహర్‌నాయుడు, కృష్ణమోహన్ నాయుడు, మండల కన్వీనర్ ముబారక్, రాజారెడ్డి, జయచంద్ర, రామకృష్ణారెడ్డి, శంకర, విజయారెడ్డి, నారాయణరెడ్డి, అజంతుల్లా, దేవేందర్‌నాయక్, మల్లికార్జున, అశోక్, చంటి, నరేష్, మహేష్, బయప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వం ప్రచారానికే పరిమితం : పరిటాలశ్రీరామ్


భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

వైసిపి ప్రభుత్వం కేవలం ప్రచారానికే పరిమితమైందని, ఎలాంటి అభివృద్ధి చేయలేదని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ విమర్శించారు. ఆయన గురువారం మండలంలోని సీసీ కొత్త కోట గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా టిడిపి నాయకులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీమేనిఫెస్టో పథకాలను ప్రజలకు వివరించారు. గ్రామస్థులు పలు సమస్యలు ప్రస్తావించగా అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో ఓబిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, పోతుకుంట లక్ష్మన్న, శ్రీనివాసులు, రామాంజినేయులు, వెంకటలక్ష్మి, విజయసారథి, సర్పంచి ముత్యాలప్పనాయుడు, వెంకటేష్, రాఘవరెడ్డి, భాస్కర్‌చౌదరి, మోహన్‌రెడ్డి, ఆదిరెడ్డి, నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, బోయ నరసింహులు, రవీంద్ర, కాటమయ్య, అంజి, చంద్రశేఖర్, చంద్రాయుడు, రవి పాల్గొన్నారు.

శ్రీరామ్ సమక్షంలో పలువురు టిడిపిలో చేరిక

పట్టణంలోని 14వ వార్డుకు చెందిన కొందరు వైసిపి కీలక నాయకులు శ్రీరామ్ సమక్షంలో టిడిపిలోకి చేరారు. కురుబ సంఘం రాష్ట్ర సెక్రటరీ బండి వెంకటేష్, నగేశ్, యశ్వంత్, బాలకృష్ణ, హరి, సుబ్బు, సుబ్రమణ్యం, అభి, సూరి, చలపతి, రాము, నారాయణస్వామి, సంతోష్, రాజేశ్, అశోక్‌తో పాటు మొత్తం 25 కుటుంబాలు టిడిపిలో చేరగా శ్రీరామ్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు.

ప్రశ్నించే గళం అంటే సిఎం జగన్‌కు వణుకు : బికె

ప్రజాశక్తి -పెనుకొండ

ప్రశ్నించే గళం అంటే సిఎం జగన్‌కు వణుకు అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి పేర్కొన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ పరాభవం ఖాయమని తెలిసి సిఎం జగన్ ఉద్దేశపూర్వకంగానే మీడియా సంస్థలు, ప్రతినిధులపై వైసిపి రౌడీ మురాతో దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. చొక్కాలు మడత పెట్టండి అంటూ జగన్ సభలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే వైసిపి కార్యకర్తలు మీడియా ప్రతినిధులు, మీడియా సంస్థలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. నియంతకు, నిరంకుశత్వ పాలకులకు ప్రజాస్వామ్యంలో చోటు లేదని ఇలాంటి వారు కాలగర్భంలో కలిసిపోక తప్పదన్నారు. మీడియాపై దాడి అంటే ప్రజాస్వామ్య గొంతు నొక్కడమేనని, ఇలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తెలిపారు. ఆయనతో పాటు కుమారుడు సాయికళ్యాణ్, నాయకులు వెంకట్‌రెడ్డి, నరేష్, అశ్వర్థ, జిరాక్స్ శీన, వెంకటేష్, గంగిరెడ్డి, బిల్లా నరేష్ ఉన్నారు.


విద్యార్థులకు మోడల్ పేపర్స్ అందజేస్తున్న బాలిరెడ్డి

'పది' మోడల్ టెస్ట్ పేపర్స్ పంపిణీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని సుందరయ్య నగర్‌లో ఉన్న శ్రీగణేష్ మున్సిపల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం 29వ వార్డ్ ఇన్‌ఛార్జి కోటిరెడ్డి బాలిరెడ్డి సొంత ఖర్చుతో మోడల్ టెస్ట్ పేపర్స్, బుక్స్ పంపిణీ చేశారు. బాలిరెడ్డి, హెచ్ఎం లక్ష్మీనారా యణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకుని మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన తహశీల్దార్‌కు సన్మానం

మడకశిర : నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశులును గురువారం డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్.హనుమంతు, ఎఐబిఎస్ఎస్ తాలూకా అధ్యక్షుడు బాబు పూలమాల, శాలువాతో సన్మానించారు. వారు మండలంలోని దళిత, గిరిజనుల సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వారితో పాటు నాయకులు శ్రీరామప్ప, రామాంజనేయులు, నాగరాజు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు : మండలంలోని కమ్మవారిపల్లి ఎంపిపి పాఠశాలలో ఎంటిఎస్‌గా పని చేస్తున్న ఉపాధ్యాయుడు నేలకోటప్ప అనారోగ్యంతో బాధ పడుతుండగా గురువారం స్థానిక ఎంఆర్‌సిలో ఎంఇఒ సురేష్‌బాబుకు సర్పంచుల సంఘం అధ్యక్షుడు జగన్మోహన్‌చౌదరి, సింగిల్‌విండో అధ్యక్షులు ఎద్దుల రామసుబ్బారెడ్డి రూ. 20,500 అందించారు. కార్యక్రమంలో హోటల్ వెంకటనారాయణ, అంగడి నాగరాజు, జయపాల్‌రెడ్డి, నాగేంద్ర ఉపాధ్యాయుడు గణేష్, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

'భవిష్యత్తుకు గ్యారెంటీ'

మడకశిర : టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు పేద ప్రజలకు వరమని మాజీ ఎమ్మెల్యే ఈరన్న తెలిపారు. 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'లో భాగంగా గురువారం ఆయన మండల పరిధిలోని చందకచర్ల గ్రామ పంచాయతీ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు పథకాలను వివరించారు. ఎమ్మెల్యే తనయుడు సునీల్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి ఘన విజయం సాధించి చంద్రబాబు సిఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్ర మంలో నాయకులు పాండురంగప్ప, రవిభూషణ్, ఆదినారాయణ, అశ్వద్ధామప్ప, రమేష్, మంజునాథ్, నరేష్, క్రిష్టప్ప, జనసేన నాయకులు పాల్గొన్నారు.


'భవిష్యత్తుకు గ్యారెంటీ'లో పాల్గొన్న ఈరన్న

సంక్షేమం, అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

గోరంట్ల రూరల్ : అవినీతికి తావు లేకుండా రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత వైసిపి ప్రభుత్వానిదేనని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని గంగాదేవిపల్లి, గొల్లపల్లి, కాగానపల్లి, చిన్నారపల్లి, బూదిలితండా గ్రామాల్లో పర్యటించారు. ముందుగా సర్పంచి రామాంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించా రు. కార్యక్రమంలో అగ్రి ఛైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సర్పంచులు అశ్వర్థరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, ఉప సర్పంచి శ్రీనివాసులు, నాయకులు గంపల రమణారెడ్డి, రఘురాం రెడ్డి, హరినాథ్‌రెడ్డి, రవిశంకర్‌రెడ్డి, శివారెడ్డి, పద్మనాభరెడ్డి, వెంకటేష్, నాగభూషణ్‌రెడ్డి, చింతా రామచంద్రరెడ్డి, రామాంజనేయరెడ్డి, శంకర్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన

పెనుకొండ : యువతకు ఉద్యోగ శిక్షణ, ఉపాధి కల్పన టిడిపితోనే సాధ్యం అని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. మండలంలోని ఎర్రమంచి వద్ద కియా ఇండస్ట్రియల్ హబ్‌లో నైపుణ్య కేంద్రం (ట్రెనింగ్ సెంటర్) వద్ద గురువారం ఆమె సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో నిరుద్యోగ యువతలో తగిన స్కిల్స్ పెంచడానికి నైపుణ్య కేంద్రాలు ఏర్పాటు చేసి ఎంతో మందికి శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు ఇప్పించి వారి భవిష్యత్తు కోసం కృషి చేసిందన్నారు. ఆమె వెంట నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'సామకోటి' ఆధ్వర్యంలో 'అన్నా క్యాంటీన్'

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో పేదల ఆకలి తీర్చడానికి టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ చేపట్టిన అన్నా క్యాంటీన్ కొనసాగుతోంది. గురువారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, మండల కేంద్రాల్లో అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదలు ఆకలి తీర్చిందన్నారు. జగన్ ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను రద్దు చేసి పేదల కడుపు కొట్టింద న్నారు. 2024 ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని అప్పుడు తిరిగి ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ఏర్పాటు చేస్తుందన్నారు. అంతవరకూ తాను సత్యసాయి ఆశీస్సులతో అన్నా క్యాంటీన్‌ను కొనసాగిస్తానని తెలిపారు.

నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన

గాండ్లపెంట : ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని ఎస్ఐ కృష్ణవేణి సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఆమె ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడపరాదు, యూనిఫారం ధరించాలి, అధిక లోడు వేసుకోవద్దు, 108 వాహనాలకు సహకరించాలని సూచించారు. అనంతరం భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఎస్ఐని సన్మానించారు. కార్యక్రమంలో జమేదార్లు పి.రామయ్య, తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, నరసింహ, బాషా, ఆటో డ్రైవర్లు బాబు, నరసింహులు, శ్రీరాములు పాల్గొన్నారు.

ధర్మవరంలో టిడిపి జెండా ఎగురవేస్తాం

ధర్మవరం టౌన్ : వచ్చే ఎన్నికల్లో ధర్మవరంలో టిడిపి జెండా ఎగురవేస్తామని, అందుకు ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారని పార్టీ రాష్ట్ర కార్యదర్శి కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని 8, 9 వార్డుల్లో గురువారం పట్టణ ప్రచార కమిటీ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్, మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, అంబటి సనత్‌కుమార్, శీలామూర్తి, గరుగు వెంగప్ప, జిలకర శీన, కరెంటు ఆది, గోసల శ్రీరాములు, మారుతిస్వామి, రాళ్లపల్లి షరీఫ్, మాధవరెడ్డి, బడిగింజల రమణ, ఉస్మాన్, చెలిమి శివరాం, నాగేంద్ర, వాసుదేవ, వీర, కొత్తపేట బాబావలి, స్వర్ణ కుమారి, మున్ని, నాగరత్న, మీనాక్షి, అఖిల, శారద పాల్గొన్నారు.

స్కౌట్ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం

లేపాక్షి : పులమతి జడ్పీ హైస్కూల్‌లో గురువారం హెచ్ఎం సుబ్బారావు అధ్యక్షతన స్కౌట్స్ జిల్లా కార్యదర్శి గిరిధర్ పర్యవేక్షణలో స్కౌట్ విద్యార్థులకు ఆలోచన దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచి అశ్వత్థ నారాయణ, పాఠశాల కమిటీ ఛైర్మన్ మంజునాథ్ హాజరయ్యారు. గిరిధర్ మాట్లాడుతూ విద్యార్థులు స్కౌట్‌లో చేరడం వల్ల క్రమశిక్షణ, నిజాయితీ, సేవాభావం అలవడతాయ న్నారు. జిల్లా విభజన తర్వాత మొదటగా పులమతి పాఠశాలలో నిర్వహించడం సంతోషంగా ఉందని హెచ్ఎం తెలిపారు. కార్యక్రమంలో పిడి రామాంజనేయులు, డిటిసి నాగరాజు గుప్తా, నాగరాజు స్కౌట్ మాస్టర్లు అశ్వర్థనారాయణ, నారాయణస్వామి, ఫణిభూషణ్‌రావు, నాగేంద్ర బాబు, వెంకటరమణప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వేధింపులు తాళలేక భర్తను కడతేర్చిన భార్య

ధర్మవరం టౌన్ : తరచూ కుటుంబ కలహాల నేపథ్యంలో విసుగు చెందిన ఓ మహిళ మద్యం మత్తులో ఉన్న భర్తను టవల్‌తో గొంతు బిగించి హతమార్చిన సంఘటన బుధవారం రాత్రి మండలంలోని సీతారాం పల్లిలో చోటుచేసుకుంది. సిఐ ఆరోహణరావు తెలిపిన వివరాలు.. సీతారాంపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథెడ్డి(35) చేనేత కార్మికుడిగా పని చేసి జీవనం సాగించేవాడు. ధర్మవరం పట్టణానికి చెందిన ధనలక్ష్మీతో పదేళ్ల క్రితం కులాంతర వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారు తరచూ గొడవ పడేవారు. గతంలో పోలీస్‌స్టేషన్‌లో, పెద్దల సమక్షంలో పంచాయితీలు చేశారు. విశ్వనాథ్‌రెడ్డి బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి భార్యతో గొడవపడ్డాడు. దీంతో క్షణికావేశంలో ఆమె టవల్‌తో భర్త గొంతు బిగించి నేలకు కొట్టడంతో అపస్మారక స్థితిలో పడిపోయాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ నరేంద్ర, సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అతడు అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసు పత్రికి తరలించారు. ధనలక్ష్మీని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

బత్తలపల్లి : అనంతపురం-కదిరి జాతీయ రహదారిపై మండలంలోని జ్వాలాపురం బస్టాప్ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో చికిత్స పొందుతూ భర్త మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. ధర్మవరం పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన పసులూరు ఓబులేసు(55), భార్య నాగమణి మగ్గం నేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి అశ్విని, అంజలి సంతానం. దంపతులిద్దరూ బుధవారం సాయంత్రం ధర్మవరం నుంచి ద్విచక్ర వాహనంపై మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామం వెళ్లి అక్కడ పెళ్లి పనులు చూసుకొని తిరిగి ధర్మవరం బయల్దేరారు. జ్వాలాపురం బస్టాప్ వద్దకు రాగానే పొలాల్లో నుంచి ఉన్నఫళంగా రెండు అడవి పందులు వేగంగా వచ్చి ఢీకొనడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడ్డారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు 108 వాహనంలో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఓబులేసు అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

గోరంట్ల రూరల్ : అనారోగ్యానికి గురైన మహిళ జీవితంపై విరక్తి చెంది ఇంట్లోనే చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్య కు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎఎస్ఐ ధనుంజయరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని మల్లాపల్లి గ్రామానికి చెందిన చాంద్‌బాషా గోరంట్లలో చికెన్ సెంటర్ నిర్వహిస్తున్నారు. అతడి భార్య కె.షబానా(26) థైరాయిడ్ వ్యాధితో కొంతకాలంగా బాధపడుతోంది. భర్త, పిల్లలు నిద్రిస్తుండగా తెల్లవారుజామున మరో గదిలోకి వెళ్లి పైకప్పునకు చున్నీతో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆమెకు భర్తతో పాటు ముగ్గురు ఆడపిల్లలు వున్నారు.

'కూతురు ఆచూకీ తెలపండి'

పుట్టపర్తి రూరల్ : కుమార్తె తప్పిపోయి 15 రోజులవుతుందని, ఫిర్యాదు చేసినా పోలీసులు ఇంతవరకూ ఆచూకీ తెలుపలేదని బాధిత తండ్రి ఈశ్వరప్ప వాపోయాడు. వివరాలు.. మండలంలోని బత్తలపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప తన కుమార్తె అశ్విని(17) ఈ నెల 6వ తేదీ నుంచి కనిపించడం లేదని 7వ తేదీ అనుమానితులపై పుట్టపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి నుంచి రోజూ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా పోలీసులు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, ఆవేదక వ్యక్తం చేశాడు.

దుకాణదారులకు ఎస్ఐ హెచ్చరిక

తలుపుల : స్థానిక బస్టాండ్ ఆవరణలో రోడ్డుకు ఇరువైపులా ఎలాంటివి అడ్డంగా ఉంచరాదని ఎస్ఐ దిలీప్‌కుమార్ దుకాణదారులను హెచ్చరించారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తలుపుల పంచాయతీలోని నంగివాండ్లపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తు న్న వ్యక్తిని అరెస్టు చేసి అతడి నుంచి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా మద్యం విక్రయిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

వాహనాల వేలం

గోరంట్ల రూరల్ : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 12 బైక్‌లు, ఒక కారును గురువారం స్థానిక స్టేషన్‌లో గోరంట్ల సిఐ సుబ్బరాయుడు, పెనుకొండ ఎస్ఐ శ్రీనివాసరెడ్డి బహిరంగ వేలం వేశారు. తద్వారా రూ. 5,41,920 ఆదాయం వచ్చినట్లు సిఐ తెలిపారు.

తాలూకా జెఎసి నేతలకు పోలీసు నోటీసులు

మడకశిర : ఈ నెల 27వ తేదీ విజయవాడలో జరిగే 'చలో విజయవాడ' ర్యాలీ, ధర్నా కార్యక్రమాలకు అనుమతి లేదని, కావున ఆ కార్యక్రమాలకు వెళ్లకూడదని పేర్కొంటూ తాలూకా జెఎసి అధ్యక్షులు రాము, స్థానిక జెఎసి నాయకులకు గురువారం స్థానిక పోలీసులు నోటీసులు ఇచ్చారు.

బాధితురాలికి ఆర్థికసాయం

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన నారాయణమ్మ దీనగాథపై దినపత్రికల్లో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది. గురువారం నల్లమాడ మండలానికి చెందిన వైసిపి యువ నాయకుడు టిడి.కృష్ణసుమన్‌రెడ్డి ఆమెకు రూ. 10 వేలను మిత్ర బృందం ద్వారా అందజేశారు. సుమన్‌రెడ్డి ఆమెతో ఫోన్‌లో మాట్లాడి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

పెనుకొండ : కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిచి రైతుల సమస్యలు పరిష్కరించే దిశగా చర్చలు జరపాలని ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ పంటలకు కనీస మద్దతు ధర ప్రకటించాలని ఢిల్లీ సరిహద్దుల్లో పోరాటం చేస్తున్న రైతులపై హర్యానా బిజెపి ప్రభుత్వం తీరు సరికాదన్నారు. పోలీసులు రబ్బర్ బుల్లెట్లను ప్రయోగించడంతో యువ రైతు మరణించారని, దీన్ని ఎపి రైతు సంఘం, సిఐటియు తీవ్రంగా ఖండిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా, మండల కార్యదర్శులు రమేష్, బాబావలి, రాజురావు పాల్గొన్నారు.

వైసిపి మైనార్టీ నాయకులతో సమావేశం

మడకశిర : పట్టణంలోని వైసిపి కార్యాలయంలో గురువారం సమన్వయకర్త ఈరలక్కప్ప మైనార్టీ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. అందులో రాష్ట్ర కార్యదర్శి వైసి.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జిబి.శివకుమార్, కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజు, పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, మైనార్టీ వక్ఫ్ బోర్డు జిల్లా ఛైర్మన్ మొగల్ నూరుల్లా, సెక్రటరీ ఇమ్రాన్‌బాషా, మైనార్టీ సెల్ ప్రెసిడెంట్ బాషాఖాన్ పాల్గొని మైనార్టీల సమస్యలను వివరించారు.

In The Court of The IIIrd Addl. Junior Civil Judge, (Excise Court) Ananthapuramu

O.S. No: 1622/2022

Between:
Canara bank (Rep by its Authorized officer, Manager & Authorized officer, Canara bank, Gondireddypalli Branch, Rapthadu Mandal.
...Plaintiff

And

V.Nagamanemma @ Manemma **...Defendant**

Notice to Defendant No:2

To:V.Nagamanemma @ Manemma W/o V.Peddanna, D.No:3-2, S.C.Colony, Narasampalli Village, Kanaganipalli Mandal, Sri Sathya Sai Dist.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 22-03-2024వ తేది ఉదయం 10:30 గం॥లకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

చిలమకూరి శ్రీనివాసులు,
వాదితరుపు వకీలు, అనంతపురం. సెల్:9490122008